



**సుబ్బారావు వేళకి ఆఫీసుకు రాడు. వచ్చినా ఏదో వంకపెట్టి మధ్యలో బైటకు పోయి వస్తూ వుంటాడు. ఆఫీసులో వున్నప్పుడు కూడా వాళ్ళతో, వీళ్ళతో పిచ్చాపాటీ కబుర్లు చెప్పి కాలక్షేపం చేస్తూంటాడు. అతడి కారణంగా ఆఫీసులో క్రమశిక్షణ తగ్గిపోయిందని బాస్ భీమశంకరం అభిప్రాయం.**

భీమశంకరం మొదటిసారి సుబ్బారావుని తన గదిలోకి పిలిచి మందలించినప్పుడు అతడు మందహాసం చేసి, "అయ్యా! వేళకు వచ్చి వేళకు పోవడానికి నేను కాయకష్టం చేసే కూలిని కాను. బుర్రతో పని చేస్తున్నాను. ఆఫీసు కోసం ఆఫీసు సమయంలోనే పని చేయాలని నా బుర్ర అనుకోదు. నిజం చెప్పాలంటే ఆఫీసు ఎనిమిది గంటలయితే దాని కోసం నా బుర్ర పన్నెండు గంటలు పని చేస్తోంది" అన్నాడు.

"అందుకు సాక్ష్యం!" అన్నాడు.

"ఆఫీసులో నేను కాలక్షేపం కబుర్లు చెప్పడమే!" అన్నాడు సుబ్బారావు నెమ్మదిగా.

భీమశంకరం తెల్లబోయాడు. ఏ నేరాన్ని తను సుబ్బారావు ముందు ప్రస్తావించాలనుకుంటున్నాడో ఆ నేరాన్నతడు సాక్ష్యంగా ఉపయోగిస్తున్నాడు.

"రెండింటికీ సంబంధమేమిటి?" అన్నాడాయన.

"సంబంధముంది. నా బుర్ర రోజుకు పన్నెండు గంటలు ఆఫీసు గురించి పని చేయడంవల్ల నేను త్వరగా ఆఫీసు పనులన్నీ ముగించగల్గుతున్నాను. బోలెడు ఖాళీ వుంటోంది. ఆ ఖాళీని కాలక్షేపం కబుర్లకు ఉపయోగించుకోగల్గుతున్నాను".

ఏమనాలో తెలియక, "పోనీ నువ్వు పన్నెండు గంటల పాటు రోజూ ఆఫీసు కోసం నీ బుర్రను ఉపయోగిస్తున్నావనే అనుకుందాం. అందువల్ల నీకు బోలెడు ఖాళీ ఏర్పడిందనే అనుకుందాం. అయితే, ఆఫీసులో అందరూ నీవంటివాళ్ళే కాదు. నీవల్ల వాళ్ళంతా కబుర్లలో దిగుతున్నారు. వాళ్ళ పని చెడిపోతోంది. కాదంటావా?" అన్నాడాయన.

"ఒకళ్ళ పని చెడగొట్టడం నాకిష్టముండదు సార్! అందుకే నేను ఆఫీసులోంచి బైటకు పోయి వస్తూంటాను" అన్నాడు సుబ్బారావు.


సుబ్బారావు తాను చేసే తప్పుల్నే సంజాయిషీగా ఉపయోగించుకోవడం భీమశంకరానికి బొత్తిగా నచ్చలేదు. కానీ ఏం చేస్తాడు? సుబ్బారావు యూనియన్ లీడర్స్‌లో ఒకడు. క్రమశిక్షణ తప్పే అవకాశం కోసమే ఎవరైనా అటు రాజకీయాల్లో కానీ, ఇటు ట్రేడ్ యూనియన్స్‌లో కానీ నాయకులు కావాలనుకుంటారని ఎవరికి తెలియదు!

చాలామంది యూనియన్ నాయకుల కంటె సుబ్బారావు చాలా నయం. అతడు తన పనిలో బాకీ వుండడు. ఇచ్చిన పని సమర్థంగా చేస్తాడు. అంతే కాదు, అతడిలో పనిచేయ్యాలన్న ఉత్సాహం కూడా వుంది.

ఏది ఏమైనా ఆఫీసన్నాక ఎంతో కొంత క్రమశిక్షణ వుండాలి. సుబ్బారావు కారణంగా అది లేకుండా పోయింది.

భీమశంకరం బాగా ఆలోచించి ఆలోచించి ఏమీ తోచక హెడ్డాఫీసును సంప్రతించాడు. హెడ్డాఫీసులో కృష్ణమూర్తి అనే ఉద్దండ పిండం వున్నాడు. ఆయన వెంటనే భీమశంకరం ఆఫీసుకు తరలివచ్చి యూనియన్ లీడర్స్‌తో మీటింగు పెట్టి సమస్యను చర్చించాడు.

"మనకు క్రమశిక్షణ ఒక్కటే ముఖ్యం కాదు. పని




ఎలాగవుతున్నదీ అన్నది కూడా చూడాలి. క్రమశిక్షణ వుండి కూడా పని జరక్కపోతే లాభమేమిటి?" అన్నాడు సుబ్బారావు.

"నీ ఉద్దేశమేమిటో చెప్పు" అన్నాడు కృష్ణమూర్తి.

"మన ఆఫీసుకి వందమంది చాలు. మాట యాభై మంది వున్నారు. కొందరు పెద్దల్ని తృప్తి పరచడానికి స్టాఫ్ సంఖ్య పెంచారు తప్ప పనిని బట్టి కాదు. అది నంబర్ వన్. నెంబర్ టూ ఏమిటంటే పని పంపకం. స్టాఫ్‌లో కొంతమందికి సరైన పనే లేదు. వాళ్ళు రికమండేషన్ అభ్యర్థులు. కొంతమందికి పని మరీ ఎక్కువ. వాళ్ళకి నోరు లేదు. చాలామందికి వారి వారి సమర్థతను బట్టి, అర్హతలను బట్టి కాక యాజమాన్యం అనుకూలతనుబట్టి పని ఇవ్వబడుతోంది. కూడికలు తప్పు చేసేవాడికి అకౌంట్స్ అప్పగిస్తే ఎలా వుంటుంది? ఇక్కడ పని డిస్ట్రిబ్యూషన్ అలాగే వుంటోంది. నేను యాజమాన్యానికి అనుకూలుణ్ణి కాదు. అందువల్ల నా కెపాసిటీలో నాలుగో వంతు పని మాత్రమే నాకివ్వబడింది. అలాగే రామారావు అవినీతిని ఆమోదించడు. అందుకని కంట్రాక్టర్స్‌తో డీల్ చేయడంలో సిద్ధహస్తుడైనప్పటికీ ఆ సీటు అతడిక్కాక ప్రభుత్వానికి నష్టం కలిగినా కొందరు వ్యక్తులకు లాభం చేకూర్చగల మరో వ్యక్తికివ్వబడింది. ఈ విషయాలన్నీ మా యూనియన్ హెడ్డాఫీసుకి ఎప్పటికప్పుడు తెలియబర్చుకుంటూనే వున్నాం......" అన్నాడు సుబ్బారావు.

"గవర్నమెంటు ఆఫీసుల్లో ఇలాంటివి తప్పవు. యాజమాన్యం, యూనియన్ సామరస్యంతో, అనగాహనతో పనిచేసి క్రమశిక్షణ కాపాడాలి. మన ఆఫీసులో బొత్తిగా క్రమశిక్షణ లేదు. ఇందుకేదైనా ఉపాయం చెప్పండి" అన్నాడు కృష్ణమూర్తి.

"ఒక్కటే ఉపాయం. అందరికీ తగినంత పని ఇవ్వడం. పని కోసం కాక పలుకుబడి వున్న పెద్ద మనుషుల కోసం ఉద్యోగాల్ని సృష్టిస్తే తప్పు లేదు. కానీ ఉద్యోగం సృష్టించేక దానితోపాటు పనినీ సృష్టించాలి. ఉద్యోగులకు వారివారి సమర్థతలను బట్టి ప్రతి ఒక్కరికీ తగినంత పని ఇవ్వాలి. కొందరికి ఎక్కువ, కొందరికి తక్కువ వుండకూడదు. అప్పుడు క్రమశిక్షణ దానంతటదే వస్తుంది" అన్నాడు సుబ్బారావు.

"ఇప్పుడాఫీసులో అందరికీ తగిన పని లేదంటావు. అందుకు సాక్ష్యం?" అన్నాడు కృష్ణమూర్తి.

"ఒక్కటే సాక్ష్యం! మాలో ఎవ్వరిమీదా ఇచ్చిన పని సక్రమంగా చేయలేదన్న ఆరోపణ లేదు. క్రమశిక్షణ పాటించడం లేదన్న దొక్కటే ఆరోపణ! ఏ ప్రభుత్వ కార్యాలయం పని గురించి కాక క్రమశిక్షణ గురించి ఉద్యోగులను తప్పు పడుతుందో ఆ కార్యాలయం వల్ల ప్రభుత్వానికి ప్రయోజనం వుండదు" అన్నాడు సుబ్బారావు.

"నీవు తెలివైనవాడివి. అందువల్ల నీ తప్పును కప్పి పుచ్చుకుంటున్నావు. ఏ ప్రభుత్వ కార్యాలయానికైనా క్రమశిక్షణ అతి ముఖ్యమైనది. ఈ ఆఫీసులో క్రమశిక్షణ బొత్తిగా లేదని రుజువయింది కాబట్టి ఇక్కడ యూరోపియన్ స్టైల్ ప్రవేశపెడుతున్నాం........." అన్నాడు కృష్ణమూర్తి.

"యూరోపియన్ స్టైల్ అంటే?" అన్నాడు సుబ్బా రావు.

"ఏ విషయమూ మాటలలో కాక ప్రాతపూర్వకంగా వుంటుంది. ఆఫీసుకు రాగానే కార్డ్ పంచ్ చేయాలి. ఎవరే టైముకు వచ్చిందీ కార్డు మీదవుంటుంది. బయటకు వెడితే కార్డు పంచ్ చేసి వెళ్ళాల్సి. ఆ విధంగా ఎవరెంత సేపు బయటకు వెళ్ళి వున్నదీ రికార్డవుతుంది. ఆఫీసులో వున్నంత సేపూ పని వున్నా లేకపోయినా ఎవరి సీట్లకు వాళ్ళు కట్టుబడాలి. ఒకసారి సీటుకు కట్టుబడి వుండడం అలవాటైతే పని దానంతటదే పుట్టుకు వస్తుంది" అన్నాడు కృష్ణమూర్తి.

"అంటే ఇకమీదట ఆఫీసుకు క్షణం కూడా లేటు కాకూడదు. లేటైతే రూల్స్ ప్రకారం పనిష్మెంటుంటుంది. అదీ యూరోపియన్ స్టైల్!" అన్నాడు భీమశంకరం.

యూనియన్ నాయకులలో కలకలం ప్రారంభమయింది. ఎక్కడా లేని ఈ యూరోపియన్ సిస్టం తమ ఆఫీసులోనే ఎందుకు ప్రవేశపెట్టాలి అని వారను కున్నారు. దీన్ని ప్రతిఘటించాలని వారనుకుంటుండగా సుబ్బారావు వారించి కృష్ణమూర్తివైపు తిరిగి, "సర్, మీరు యూరోపియన్ స్టైల్ మన ఆఫీసుకు మేలు చేస్తుందని నమ్మే పక్షంలో మాకేమీ అభ్యంతరం లేదు" అన్నాడు.

వెంటనే యూనియన్ నాయకులలో మళ్ళీ కలకలం ప్రారంభమయింది.

"వీల్లేదు, వీల్లేదు. మా అలవాట్లు క్షణాల్లో మారేవి కాదు. మరే ఉపాయమైనా చూడాలి. మన ఆఫీసులో యూరోపియన్ స్టైల్‌కు మేమంగీకరించం" అన్నారు చాలామంది.

సుబ్బారావు తనవారివంక తీవ్రంగా చూసి, "మీకు నామీద గురి వుంటే, నా తెలివితేటలమీద నమ్మకముంటే నా మాటల్ని వ్యతిరేకించకండి. ఇది నా విన్నపం" అని కృష్ణమూర్తి వైపు తిరిగి, "సర్! మమ్మల్ని క్రమశిక్షణ గురించి కాక పని గురించి తప్పు పట్టండి. లేదా యూరోపియన్ స్టైల్‌కి ఈ క్షణం నుంచే మేము సిద్ధం" అన్నాడు.

"ఏమిటీ! యూరోపియన్ స్టైల్ మీ గురించి ప్రవేశపెడుతుంటే అదేదో మమ్మల్ని బెదిరించడానికన్నట్లు మాట్లాడతావు? మొదట్నించీ నీది తిరకాసు బేరమే! ఈ క్షణం నుంచే యూరోపియన్ స్టైల్ మన ఆఫీసులో ప్రవేశపెట్టబడిందనుకో" అన్నాడు భీమశంకరం.

"అయితే మిస్టర్ కృష్ణమూర్తీ! నీ దగ్గర సిగరెట్టుందా?" అన్నాడు సుబ్బారావు లేచి నిలబడి.

"ఉంది" అన్నాడు కృష్ణమూర్తి అతడు మాట్లాడిన పద్ధతికి తెల్లబోతూ.

"అయితే ఒకటిలా పారేయ్" అన్నాడు సుబ్బారావు..

కృష్ణమూర్తి తన జేబులోంచి ప్యాకెట్ తీసి బల్ల మీదుంచి సుబ్బారావు వైపు తోశాడు. సుబ్బారావందులోంచి ఓ సిగరెట్ తీసి పెదాల మధ్య వుంచుకుని ప్యాకెట్ వెనక్కు తోసి భీమశంకరం దగ్గరకు వెళ్ళి, "మిస్టర్ భీమశంకరం! నీ లైటరుతో నా సిగరెట్ వెలిగించిపెడుదూ" అన్నాడు.

"ఏమిటిది?" అన్నాడు భీమశంకరం కోపంగా.

"ఇదా......ఇది యూరోపియన్ స్టైల్. ఈ స్టైల్లో ఉద్యోగులు బాస్‌ని చూస్తే.లేచి నిలబడరు. సర్ అనరు. చేతులు కట్టుకుని మాట్లాడరు. అతణ్ణి ఓ స్నేహితుడిలా భావించి ఏమోయ్ అంటారు, సిగరెట్ వెలిగించమంటారు. భుజం తట్టి మాట్లాడతారు..."

సుబ్బారావింకా ఏదో అనబోతుండగా అతడు తన భుజం తడుతున్న అనుభూతి కలిగి, "వద్దు, యూరోపియన్ స్టైల్ మనకొద్దు" అన్నాడు భీమశంకరం.

కృష్ణమూర్తి అతడివంక చూస్తూ అంగీకార సూచకంగా తలూపాడు.

అధికారి తన క్రింది ఉద్యోగుల్ని స్నేహితులుగా కాక బానిసలుగా భావించే ఈ దేశంలో, ఉద్యోగులకు పనివ్వకుండా వారి నుం[డి] క్రమశిక్షణను మాత్రం కోరే ఈ దేశంలో, ప్రధాన మంత్రి నుంచి సామాన్య పౌరుడి వరకూ తమ అహం కానీ, స్వార్థం కానీ ఇసుమంత కూడా త్యాగం చేయలేని ఈ దేశంలో ఎప్పటికైనా యూరప్ సాధించిన ప్రగతి వస్తుందా?................ఈ కథలోంచే పుట్టిన ఈ ప్రశ్నకు........సమాధానం కథలోనే లేకపోలేదు.